

న్యూస్ బాక్స్

రేపు పెద్దపల్లికి మంత్రుల రాక

● సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణారావు




జూనియర్ కళాశాల మైదానంలో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఈనెల 16న పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సభకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర వ్యవసాయ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన సభ నిర్వహించనున్న జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని ఆర్‌డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, పార్టీ నాయకులు ఉప్పు రాజు, నూగిళ్ల మల్లయ్య, బొడ్డుపెల్లి శ్రీనివాస్, సయ్యద్ మస్రత్, దొడ్డుపల్లి జగదీష్, బండారి సునీల్, బొంకూరి అవినాష్ పాల్గొన్నారు.

ఆగస్టు వరకు సరిపడా ఎరువుల నిల్వలు

పెద్దపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు నెల వరకు సరిపడా ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 9400 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టులో 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమున్నదని, ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు ఆగస్టు మాసం వరకు సరిపోతాయని పేర్కొన్నారు. ఆగస్టులో కూడా యూరియా సరఫరా ఉంటుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, జిల్లాకు కావల్సిన యూరియాను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి తెప్పిస్తామన్నారు.

జిల్లా వ్యవసాయ శాఖాధికారిగా శ్రీనివాస్



పెద్దపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖాధికారిగా బి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హుస్నాబాద్ ఏడీఏగా పని చేస్తున్న శ్రీనివాస్‌కు డీడీఏగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయ శాఖాధికారిగా పని చేసిన ఏడీఏ దోమ ఆదిరెడ్డికి హన్మకొండ ఏడీఏగా బదిలీ చేశారు. వాస్తవానికి ఆదిరెడ్డి బదిలీ జరిగి ఆరు మాసాలు గడిచినప్పటికీ రిలీవ్ చేయలేదు. డీడీఏ పదోన్నతులు పూర్తి కాగానే జిల్లాకు ఒక అధికారిని నియమించిన తర్వాత ఆదిరెడ్డిని రిలీవ్ చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు డీఏవోగా బి శ్రీనివాస్‌ను నియమించారు. ఆయన మంగళవారం విధుల్లో చేరనున్నారు.

- సన్నధాన్యం బోనస్ కోసం రైతుల నిరీక్షణ
- యాసంగిలో 7,93,400 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోలు
- రైతులకు రావాల్సిన బోనస్ రూ. 39.67 కోట్లు
- సీజన్ ముగిసి 45 రోజులు గడుస్తున్నా విడుదల కాని బోనస్

బోనస్ ఎప్పుడు?



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సన్న ధాన్యం బోనస్ డబ్బుల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్న ధాన్యానికి సంబంధించి ఇప్పటివరకు బోనస్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేయలేదు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఎప్పటికప్పుడు బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం సీజన్ ముగిసి నెల 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతులకు ఇవ్వాల్సిన 39 కోట్ల 67 లక్షల రూపాయల విలువైన బోనస్ డబ్బులు విడుదల చేయలేదు. దీంతో ఆ డబ్బులను ఇస్తుందా, లేదా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరి రైతులకు క్వింటాలు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తామని, రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం ఇస్తా మని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నది. తీవ్రమైన నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు పై దృష్టి సారించింది. రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని కేవలం 20 నుంచి 30 శాతం మంది వినియోగదారులు మాత్రమే వినియోగిస్తుండగా, మిగ తా వినియోగదారులు నల్ల బజారులో విక్రయించారు. ఈ విషయాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీని నెరవేర్చాలంటే రైతులను సన్న రకం ధాన్యం సాగు వైపు దృష్టి సారించేలా చేయాలని భావించిన ప్రభుత్వం బోనస్ ప్రకటించింది.

గత ఏడాది వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యం పండించే రైతులకు క్వింటాలు ధాన్యానికి 500 రూపా యల చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. ఆ మేరకు అనేక మంది రైతులు సన్న రకం వరి పంటను సాగు చేశారు. ఆ సీజన్‌లో సుమారు 104 కోట్ల రూపా యల బోనస్ డబ్బులను ప్రభుత్వం రైతులకు చెల్లించింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కింద మిల్లింగ్‌కు ఇచ్చిన పౌర సరఫరాల శాఖ ఆ మొత్తం బియ్యాన్ని సేకరించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సన్న బియ్యాన్ని రేషన్ షాపుల

(మిగతా 8వ పేజీలో)

విద్యుత్ ప్లాంట్ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోండి

● జెన్‌కో సీఎండీని కోరిన మక్కాన్‌సింగ్



జెన్‌కో సీఎండీ హరీష్‌కు మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 14(ఆంధ్రజ్యోతి): రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ పనులను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెన్‌కో సీఎండీ హరీష్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 800మెగావాట్ల థర్మల్‌పవర్ ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైనదని, ఇది విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా రామగుండం ప్రాంత అభివృద్ధికి దోహద పడుతుందని, ఈ ప్రాజెక్టు పనుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టుతో పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రాజెక్టు కోసం అవసరమైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను తీసుకువచ్చే విధంగా ఆయా శాఖలతో చర్చలు జరపాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎండీ హరీష్ త్వరలోనే టెండర్ ప్రక్రియ, నిధుల వ్యవస్థీకరణ, అనుమతుల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు మక్కాన్‌సింగ్ తెలిపారు.

పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయండి

రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తయితే రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, ఇక్కడ వర్షాధారంగా మాత్రమే వ్యవసాయం చేస్తున్నారని, ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సాగునీటి ప్రాజెక్టులపై, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. పలు గ్రామాల్లో ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టులు నిలిచిపోయాయని, వాటికి మరమ్మతులు చేయించా లని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ పార్టీ

-17 న జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : జిల్లా కార్యదర్శి సదానందం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

పెద్దపల్లి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సీపీఐ పార్టీ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. సోమవారం ఎన్ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 17న జరిగే నాలుగో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, కార్మికులకు, కర్షకులకు పిలుపునిచ్చారు. సభకు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీతారామయ్యలు హాజరవుతారన్నారు. ఈ మహాసభను పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదల కోసం, భూమి లేని పేద ప్రజల కోసం లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని, సీపీఐ పార్టీ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రజలకోసం నిరంతరం పోరాడే పార్టీ అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, కె.కనకరాజు, మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కళ్లెపెల్లి నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మార్కాపూరి సూర్య, పెరక రాయమల్లు, బొంకురి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల వివాదం

● శ్మశాన వాటిక స్థలంలో సోలార్‌ప్లాంట్ నిర్మాణం ● అధికారులు వారించినా అక్కడే నిర్వహించిన గ్రామస్థులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1072లో శ్మశాన వాటికకు కేటాయించారు. అదే స్థలాన్ని సోలార్ ప్రాజెక్టుకు కేటాయించగా పనులు ప్రారంభమయ్యాయి. అయితే సోలార్ ప్రాజెక్ట్ వద్దని శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన ఏనుగుల లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందింది. కొంతకాలంగా శ్మశానవాటికగా వినియోగిస్తున్న స్థలంలో మృతదేహాన్ని పాతిపెట్టేందుకు కుటుంబ సభ్యులు గుంతలు తవ్వుతుండగా అధికారులు అడ్డుకొన్నారు. దీంతో గ్రామస్థులు అక్కడకు చేరుకొని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకొన్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. అయినప్పటికీ శ్మశానవాటిక స్థలంలోనే దహన సంస్కారాలు చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, రూరల్ ఎస్ఐ మల్లేష్‌లు చేరుకొని మాట్లాడినా వినలేదు. సీఐ ప్రవీణ్‌కుమార్ చేరుకొని గ్రామస్థులు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అప్పటికే మృతదేహం అక్కడికి చేరుకోగా తవ్విన గుంతలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఈ స్థలంలోనే దహన సంస్కారాలు చేపడుతున్నామని, సోలార్ ప్రాజెక్టును ఇతర స్థలంలో కేటాయించాలని అధికారులకు విన్నవించారు.

వ్యాధులతో సతమతం

రోగులతో కిటకిటలాడిన ఖని జనరల్ ఆసుపత్రి



ఓపీ కౌంటర్ వద్ద రోగులు, బంధువుల క్యూ

కళ్యాణ్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాల సీజన్ ప్రారంభం కావడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సోమవారం పెద్ద ఎత్తున రోగులు తరలివచ్చారు. శని, ఆదివారాలు సెలవుదినం కావడంతో వివిధ ఓపీల వద్ద రోగులు బారులు తీరారు. వైద్య పరీక్షల కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. చాలా మంది టైఫాయిడ్, వైరల్ ఫీవర్, దగ్గు, జలుబుతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తున్నారు. జనరల్ మెడిసిన్‌లో 332మంది, ఈఎన్‌టీసీలో 44మంది, గైనిక్ విభాగంలో 132 మంది, ఆర్థోపెడిక్‌లో 173 మంది, ఆప్తమాలజీలో 58మంది, సర్జరీకి సంబంధించిన వాటిలో 171మంది, స్కిన్ వ్యాధులకు సంబంధించి 112మంది, ఈఎన్‌టీలో 44మంది, పిడియాట్రిక్‌లో 130మంది, పలమలాజీలో 27మందితో పాటు వివిధ విభాగాల్లో కలిపి 1260 మంది వైద్య చికిత్స కోసం వచ్చారు. వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

రోగులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. గోదావరిఖని, కమాన్‌పూర్, ముత్తారం, రామగుండం, అంతర్గాం మండలాలతో పాటు మంచిర్యాల జిల్లాలోని ఇందారం, జైపూర్, భీమారం మండలాల నుంచి రోగులు వచ్చారు. దీంతో ఆసుపత్రిలో ఇన్‌పేషంట్లతో కిటకిటలాడింది.

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ఏర్పాటు చేసిన పెద్దపట్నం 7

తెలంగాణ రైతాంగంపై కేంద్రం వివక్ష



ఆర్ఎఫ్‌సీఎల్ కంట్రోల్ రూమ్ పరిశీలిస్తున్న ఎంపీ వంశీకృష్ణ 7

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఓదెల మండలం పోత్కపల్లి గ్రామానికి చెందిన ఆర్.తిరుపతి కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామ శివారులో ఉన్న చిన్న కుంట చెరువు శిఖం భూమి కొందరు గ్రామస్తులు కబ్జా చేసి అమ్ముకుంటున్నారని, పందిళ్ళ శిఖం భూమి పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండ మాజీ సర్పంచ్ గ్రామస్థులు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల జాబితా విడుదల చేయలేదని, అర్హుల జాబితా విడుదల చేయాలని దరఖాస్తు చేసుకోగా అధికారులకు రాశారు. సుల్తానాబాద్ మండలం కందు నూరిపల్లి గ్రామానికి చెందిన జి. సదయ్య దివ్యాంగుడినని, గతంలో అంత్యోదయ కార్డు ఉండేదని 30 కేజీల బియ్యం వచ్చేదని ప్రస్తుతం రావడం లేదని, కార్డు ఇప్పించాలని దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్‌కు రాస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, పాల్గొన్నారు.

- కిరాణ, హోటళ్లలో యథేచ్ఛగా విక్రయాలు
- తనిఖీలు చేపట్టని అధికారులు
- బ్రాండెడ్ కంపెనీల పేరిట నకిలీ అమ్మకాలు

కల్తీమయం



కమాన్‌పూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు కల్తీ అవుతున్నాయి. అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. కిరాణషాపులు, హోటళ్లలో తనిఖీలు లేకపోవడంతో వాటిని ఉపయోగించిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

మండలంలో నిల్వ ఆహార పదార్థాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సింగరేణి, ఇటుక బట్టీల కార్మికులు అధికంగా ఉండే ప్రాంతం కావడంతో కల్తీ వస్తువులు ఎక్కువగా విక్రయిస్తున్నారు. కొందరు నెలవారి సరుకులు కొనుగోలు చేస్తే, మరి కొందరు రోజువారిగా కొనుగోలు చేస్తుంటారు. పలు కిరాణ షాపుల యజమానులు ఆహార పదార్థాలతోపాటు కల్తీ నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీ చేయాల్సిన మండల, జిల్లా స్థాయి అధికారులు చూసీచూడకుండా వదిలి వేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే నూనెలు, పప్పులు నిత్యావసర దినుసుల కల్తీకి పాల్పడుతున్నారు. అధికారులకు ముడుపులు ముట్టచెపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కన తినే ఆహార పదార్థాలు, స్వీటు దుకాణాల్లో కూడా కల్తీ పదార్థాలు వినియోగిస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రధాన హోటళ్లు, భోజనశాలలు, దాబాలలో అపరిశుభ్రత, వారాల తరబడి నిల్వ ఉన్న పదార్థాలను వండుతున్నారని తెలుస్తోంది. పానీపూరీలు, చాట్, సమోసాలు, నిల్వ ఉన్న నూనెతో బజ్జీల కొట్టు, హోటళ్ల నిర్వాహకులు వినియోగిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. దుకాణాలకు వస్తున్న సరుకులను యజమానులు కూడా గుర్తించలేదం లేదని తెలుస్తోంది. బియ్యం మొదలుకొని పప్పుదినుసులు, పండి, గసాలు, జీలకర్ర, మిరియాలు, వంట నూనెలు సైతం కల్తీలుగా చలామణీ అవుతున్నాయి. మొదటి రకం, రెండో రకం అంటూ విక్రయిస్తున్నారు. ఈ కల్తీ వ్యాపారం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. వార సంతలో బ్రాండెడ్ నూనె ప్యాకెట్ల పేరుతో నకిలీ ప్యాకెట్లు లభ్యమవుతున్నాయి. ధరలో తేడా ఉండ టంతో ప్రజలు వీటినే కొంటున్నారు. అధికారులు ఇలాంటి కల్తీ దందాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై ఆహార తనిఖీ అధికారి రాజిరెడ్డిని వివరణ కోసం ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు. మండలంలో జరుగుతున్న కల్తీ వ్యాపారంపై పలువురు ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

తనిఖీలు చేపట్టాలి

రానవేన లక్ష్మణ్, కమాన్‌పూర్

కల్తీ ఆహార అమ్మకాలపై తనిఖీలు చేపట్టాలి. మండల కేంద్రాల్లో సైతం ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పానీపూరీలు, చాట్ అమ్మకాలు, కార్న్‌ఫ్లోర్‌లో రంగులతో చికెన్‌పై అమ్మకాలు సాగిస్తున్నారు. బ్రాండెడ్ పేరిట నకిలీ ప్యాకెట్ చేయించి నిత్యావసర వస్తువులు, వంట నూనెలు కల్తీ వ్యాపారం ఎక్కువగా జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. దాడులు నిర్వహించి కల్తీ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి

ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు

● గర్భిణీ ముఖంపై దద్దుర్లు



బాధితురాలికి ఇచ్చిన కాలం చెల్లిన మందులు

జమ్మికుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గర్భిణీకి వైద్య సిబ్బంది కాలం చెల్లిన మందులు ఇవ్వడంతో ఆమె ముఖంపై దద్దుర్లు ఏర్పాడ్డాయి. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్‌కు చెందిన హరీష్-కావ్య దంపతులు గతనెల 30న వైద్యపరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఓ చీటీపై మందులు రాశారు. ఆమె భర్త హరీష్ ఫార్మసీ విభాగంలోకి వెళ్లి మందులు తీసుకోని ఇంటికి వెళ్లారు. సదరు మందులు వాడటం వల్ల ముఖంపై దద్దుర్లు వచ్చాయి. దీంతో ఈనెల 10న మళ్లీ దంపతులు ఆసుపత్రికి వచ్చారు. పది రోజుల క్రితం తీసుకున్న మందులు వాడటం వల్లే తన భార్య ముఖంపై దద్దుర్లు వచ్చాయని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వాటి ఎక్స్‌పైరీ డేట్ జూన్ 25వరకు ఉందని, కాలం చెల్లిన మందులు ఎలా ఇస్తారని మండిపడ్డారు. స్పందించిన ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తమవద్ద కాలం చెల్లిన మందులు లేవని, తాము విచారణ చేపడుతామని, నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం

వీణవంక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరువాగులోని ఇసుక క్వారీలో ఆదివారం అర్ధరాత్రి ఓ లారీ క్యాబిన్‌లో షార్ట్‌సర్క్యూట్ అయింది. దీంతో లారీలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లారీ దగ్ధం అయినట్టు స్థానికులు తెలిపారు. వెంటనే ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. లారీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. దాదాపు పది లక్షల ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు.



'ఉపాధి' కూలీలకు బీమా

● ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం అమలు

కరీంనగర్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసలు నివారించేందుకు ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం కూలీలకు మరో ప్రయోజనం చేకూర్తుస్తూ నిర్ణయం తీసుకుంది. జాబ్ కార్డు పొందిన ప్రతీ ఒక్కరికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేసింది. కలెక్టర్ పర్యవేక్షణలో కూలీలతో ప్రీమియం సొమ్ము చెల్లించేలా ప్రొత్సహించాలని ఆదేశాల్లో పేర్కొంది. కరీంనగర్ మండలంలో కూలీలు 7,280 మంది ఉండగా 4,572 జాబ్ కార్డులు పొందారు. వీరందరికీ లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు పని ప్రదేశాల్లో ఏదైనా కారణంతో మృతి చెందిన వారికి 2లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేవారు. గాయపడిన వారికి వైద్య ఖర్చుల కోసం సాయం చేసేవారు. ఇప్పటి నుంచి ఎక్కడ అనుకోని సంఘటన జరిగినా బీమా వర్తించనుంది. ప్రీమియం చెల్లించిన ప్రతీ కూలీకి బీమా సొమ్ము చెల్లించనున్నారు. బ్యాంకులో 20 రూపాయలు చెల్లించి బీమా చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కూలీలకు బీమా ప్రీమియం చెల్లింపు సమస్యగా మారింది. కచ్చితంగా బ్యాంకుకు వెళ్లి నమోదు చేసుకోవాలి దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు దూరంగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. చాలా మంది కూలీలు తమ వేతనాలను సీఎస్సీ కేంద్రాలు నగదు రహిత లావాదేవీల ద్వారా తీసుకుంటున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు బీమా ప్రీమియం నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

● పథకం వివరాలు

సురక్ష బీమా యోజనకు 18నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులు. జాతీయ బ్యాంకుల్లో పేరు నమోదు చేసుకోవాలి. ఆ బ్యాంకు ఖాతా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్న బ్రాంచ్‌లో ఖాతా నుంచి ఏటా 20 రూపాయలు బీమాకు జమ చేయాలని లేఖ ఇవ్వాలి. ప్రీమియం జూన్ 1 నుంచి మే 31 వరకు వర్తిస్తుంది. పేరు నమోదు చేసుకున్న వారు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించిన పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి 2లక్షల రూపాయల పరిహారం పొందే అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు పాక్షిక అంగవైకల్యం కలిగిన లక్ష రూపాయలు పరిహారం అందే అవకాశం ఉంది.

● ఉపాధిహామీ సిబ్బంది చేయాల్సిన పని

అన్ని గ్రామాల్లో వేతనదారుడి ఇంటి పేరుతోపాటు తండ్రి, భర్త పేరు, వయస్సు, బ్యాంక్ ఖాతా, ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయాలి. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వేతనదారుల పేర్లు సేకరించాలి. ఈ నెల 15 నుంచి 31 వరకు వేతన దారుల నుంచి అనుమతి పత్రం సేకరించి బ్యాంకుల్లో అందజేయాలి. ప్రతీ రోజు పథకం కింద నమోదైన వివరాలు జిల్లా కార్యాలయానికి పంపించాలి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఓ పెట్రోలు బంక్ ఎదుట సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బాలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. బాలయ్య తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్లగొల్లపల్లి వైపున బయలుదేరి పెట్రోల్ బంక్ ఎదుట తిరిగి ఎల్లారెడ్డిపేటకు వచ్చేందుకు వాహనాన్ని తిప్పాడు. రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వెళుతున్న మరో ద్విచక్రవాహనం బాలయ్య బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్‌క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ఎం.రఘుతేజ కరీంనగర్‌రూరల్ మండలం గోపాల్‌పూర్ వద్ద ఏప్రిల్27న సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదుచేయగా కరీంనగర్‌రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కరీంనగర్‌రూరల్ ఠాణాలో సీఐ నిరంజన్‌రెడ్డి సెల్‌ఫోన్‌ను రఘుతేజికి అప్పగించారు.

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి

మల్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బస్సు ఆపలేదని ఓవ్యక్తి సోమవారం ఆర్టీసీ డ్రైవర్‌పై మల్యాలలో దాడికి పాల్పడ్డాడు. ఆర్టీసీ డ్రైవర్,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల-పెగడపల్లి మార్గంలో జగిత్యాల డిపోకుచెందిన ఆర్టీసీబస్సు మల్యాల, తాటిపల్లి, లంబాడిపల్లి, దోమలకుంట మీదుగా నిత్యం నాలుగుట్రిప్పులు నడుస్తుంది. సోమవారం ఉదయం పెగడపల్లి నుంచి జగిత్యాల వస్తుండగా లంబాడిపల్లిలో ప్రయాణికులతోపాటు విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులను ఎక్కించుకున్నారు. అక్కడినుంచి కదిలే సమయంలో ఎనగందుల దిలీప్ అనేవ్యక్తి వచ్చి తమ వాళ్లు వస్తున్నారని ఆగాలని డ్రైవర్ పంతం రవీందర్‌ను కోరాడు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం ఇప్పటికే ఆలస్యం అయిందంటూ డ్రైవర్ బస్సును ఆపలేదు. మల్యాల అంగడిబజారు వరకు బస్సు చేరుకోగా తమవాళ్లను తీసుకొని ద్విచక్ర వాహనంపై వచ్చిన దిలీప్ బస్సుకు అడ్డంగా నిలిపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి బస్సు ఎందుకు ఆపలేదని దాడి చేశాడు. దీంతో డ్రైవర్ బస్సును మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌పోర్ట్ యజమానికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో మరొక వ్యాపారిని మోసం చేసిన సిరిసిల్ల పట్టణంలోని అశోక్‌నగర్‌కుచెందిన ప్రయాకర్‌రావు మధుసూదన్ అనే ట్రాన్స్‌పోర్ట్ యజమానికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్లటౌన్ సీఐ కె కృష్ణ వివరాల ప్రకారం.. వరంగల్‌జిల్లా కరీమాబాద్‌కు చెందిన పుట్ట మోహన్‌రావు ఆదర్శట్రాన్స్‌పోర్ట్ కంపెనీ నడిపిస్తున్నాడు. ఇదేవిధంగా సిరిసిల్లలో ప్రయాకర్‌రావు మధుసూదన్‌కు హరిహరన్ ట్రాన్స్‌పోర్ట్ ఉంది. ఇద్దరిది ఒకే వ్యాపారం అయినందున పరిచయం పెరిగింది. ఒకరి ట్రాన్స్‌పోర్ట్ మరొకరు వాడుకునేస్థాయికి చేరారు. ఆగస్టు 20, 2015న కరీంనగర్ సమీపంలోని బావుపేట నుంచి గ్రానెట్‌క్వారీలనుంచి బండలు కాకినాడడఓరేవుకు ట్రాన్స్‌పోర్ట్ చేయుటకు ట్రాలీలారీలు కావాలని పుట్ట మోహన్‌రావుకు మధుసూదన్ ఫోన్‌చేసి మాట్లాడుకుందాం ఒకసారి ఆఫీస్‌కు రమ్మన్నాడు. దీంతో సిరిసిల్లకు వచ్చిన మోహన్‌రావుతో నెలకు 30ట్రాలీలారీలు కావాలని, గ్రానెట్‌బ్లాక్‌లు ట్రాన్స్‌పోర్ట్ చేస్తే టన్నుకు 1,175చొప్పున కిరాయిఇస్తానని మధుసూదన్ చెప్పాడు. ఈవిధమైన ఒప్పందంతో పలుమార్లు గ్రానెట్‌ట్రాన్స్‌పోర్ట్‌చేయగా రూ.21.41లక్షలు కిరాయి అయింది. ఇందులో రూ.10.32లక్షలు చెల్లించగా మిగతా 11.09లక్షలు చెల్లించాల్సిఉంది. ఇందుకు చెక్కులు ఇచ్చినప్పటికీ అవి చెల్లలేదు. బాకీడబ్బులు ఇవ్వమని మధుసూదన్‌ని అడిగితేబెదిరించడంతోపాటు ఉద్దేశ్యపూర్వకంగా మోసం చేశాడని బాధితుడు మోహన్‌రావు కోర్టును ఆశ్రయించాడు. ఈమేరకు కోర్టువెంటనే అతనిపై కేసునమోదు చేయాలని రెఫర్‌చేయగా అప్పటిఎస్ఐ శేఖర్ కేసు నమోదుచేసి చార్జీషీట్ దాఖలుచేశాడు. ఈమేరకు కోర్టు కానిస్టేబుల్ నరేశ్‌కోర్టులో ఐదుగురుసాక్షులను ప్రవేశపెట్టగా పీపీసందీప్ వాదించగా కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితుడైన మధుసూదన్‌పై నేరంరుజువు కావడంతో న్యాయమూర్తి మూడేళ్ల కఠినకారాగార జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మృతి చెందిన చంద్రయ్య

ధర్మారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చుట్టపు చూపుగా వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఘటన ధర్మారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పర్వతం పాపయ్య-మమత దంపతులు మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా ఇనుప సామాను దుకాణం నడిపిస్తూ జీవిస్తున్నారు. మంచిర్యాలజిల్లా ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మమత సోదరుడు పస్తం చంద్రయ్య(62) ఆదివారం పాపయ్య ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి పాపయ్య ఇంటిఎదుట ఉన్న విద్యుత్‌స్తంభం వైర్ తెగిపడింది. దానిని కరెంట్ వైర్‌గా భావించకుండా పక్కకు జరిపే క్రమంలో చంద్రయ్య విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పస్తం చంద్రయ్య కొడుకు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి మూడురోజులు జైలుశిక్షను గోదావరిఖని రెండవ అదనపున్యాయమూర్తి వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్‌ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు తెలిపారు. రెండో సారి మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆటో డ్రైవర్‌తోపాటు టూవీలర్ నడిపిన వ్యక్తికి మూడు రోజులు జైలుశిక్ష విధించగా మరో 9మందికి రూ.17వేల జరిమానా విధించినట్టు చెప్పారు. ఆయన మాట్లాడుతూ మద్యంసేవించి వాహనాలు నడుపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్‌వీలర్ వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు.

పోలీసుల సామగ్రిని తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ


పోలీసుల సామగ్రిని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ భీంరావు

గంగాధర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గంగాధరపోలీస్‌స్టేషన్‌లో సామగ్రిని అడిషనల్ డీసీపీ భీమ్‌రావు సోమవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని, ప్రహరీని, భవనం నిర్మించిన భూమి వివరాలను పరిశీలించారు. స్టేషన్‌లో క్రైం వెహికిల్స్, ప్రమాదానికి గురైన వాహనాలు, స్టేషన్‌లో అమలు చేస్తున్న 5ఎస్ విధానం, స్టేషన్‌రికార్డు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌సిబ్బంది గదులు వినియోగంలో ఉన్నాయా, స్టేషన్‌కు నీటిసరఫరా, విద్యుత్‌సరఫరా, సీసీటీవీల పనితీరును పరిశీలించారు. మొక్కల పెంపకంపై సూచనలందించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీకృష్ణ, ఆర్ఎస్సై తిరుపతి, ఏఎస్సైలు మల్లేశం, భగవాన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

గంగాధర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కొండన్నపల్లి శివారు వరదకాలువలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన మహ్మమద్ ఇర్ఫాన్(28) ఆదివారం గంగాధర మండలం కొండన్నపల్లి వరదకాలువలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశత్తు కాలు జారి కాలువలో పడి మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో మత్స్యకారుడు మృతి


చిట్యాల రెడ్డి(ఫైల్)

మల్లాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో సోమవారం చేపల వేటకు వెళ్లి చిట్యాల రెడ్డి(70) అనే మత్స్యకారుడు గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామంలోని చెరువులో చేపలు పట్టుతున్న క్రమంలో గుండెపోటు వచ్చి కిందపడిపోయాడు. స్థానికులు గమనించి చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతిడికి భార్య రాజగంగు, ఇద్దరు కుమార్లు, ఒక కూతురు ఉన్నారు.

మహిళా ఠాణా సీఐపై విచారణకు ఆదేశం

● విచారణ అధికారులుగా ఏసీపీ మాధవి, టూటౌన్ సీఐ

కరీంనగర్ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చొప్పదండికి చెందిన కడారి శ్రావణ్‌కుమార్ ఆత్మహత్య ఘటనలో కరీంనగర్ మహిళా ఠాణా సీఐ శ్రీలతపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీపీ గౌస్ ఆలం ఆదేశాలు జారీ చేశారు. తనపై సీఐ శ్రీలత అక్రమంగా వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారని, దూషించారని, బలవంతంగా తనతో విడాకులకు సంతకం చేయించారని సెల్ఫీ వీడియోలో ఆరోపిస్తూ శ్రావణ్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై చొప్పదండి పోలీసురాణాలో సీఐ శ్రీలతపై ఆదివారం ఎస్సీఎస్టీ కేసుతోపాటు శ్రావణ్ కుమార్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లుగా కేసు నమోదైంది. రెండు సెక్షన్‌ల కింద ఏ-7గా సీఐపై కేసు నమోదుచేశారు. శ్రావణ్‌కుమార్ భార్య నీలిమతోపాటు ఆమెతల్లి, నీలిమ తరపున ఠాణాకువెళ్లిన మధ్యవర్తులు, బంధువులపైనా కేసు నమోదైంది. సీఐపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసు విచారణను హుజూరాబాద్ ఏసీపీ మాధవికి అప్పగించగా, ఆత్మహత్యకు ప్రేరేపించిన సెక్షన్‌పై కేసు విచారణను రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డికి అప్పగించారు. ఎస్సీఎస్టీ కేసులను ఏసీపీస్థాయి అధికారి విచారణ జరపాల్సి ఉండగా కరీంనగర్‌రూరల్ ఏసీపీ పోస్ట్ ప్రస్తుతం ఖాళీగా ఉండడంతో హుజూరాబాద్ ఏసీపీని విచారణ అధికారిగా నియమించారు. రెండో ఠాణా పరిధికి మహిళా ఠాణావస్తుందనే ఉద్దేశంతో టూటౌన్‌సీఐని విచారణ అధికారిగా నియమించారు. మహిళాఠాణాలో వరకట్నం వేధింపుల కేసునమోదవడంతో కడారి శ్రావణ్ కుమార్, అతడిభార్య నీలిమను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈక్రమంలో తన చావుకు మహిళా ఠాణా సీఐ కారణమనే ఆరోపణలతో శ్రావణ్‌కుమార్ సెల్ఫీవీడియోవైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆ కారణంగానే సీపీ ఆదివారం రాత్రి హుటాహుటిన విచారణకు ఆదేశించారు.

నంబరు ప్లేట్ లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

● 80 వాహనాల గుర్తింపు, వాహనదారులకు జరిమానా


కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐలు కరీంఉల్లాఖాన్, పర్శ రమేష్

కరీంనగర్ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంబరు ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం వన్‌టౌన్ ఎదుట సీఐ కరీంఉల్లాఖాన్, పర్శ రమేష్ ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 80 ద్విచక్రవాహనాలను గుర్తించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించారు. నంబరు ప్లేట్‌లను బిగించుకున్న తరువాతనే వాహనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐ కరీంఉల్లాఖాన్ మాటాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని అన్నారు. ప్రతి వాహనంపై రిజిస్ట్రేషన్ నంబరును సూచించే ప్లేట్‌ను బిగించుకోవాలన్నారు. రిజిష్టర్డ్ నంబరు మినహా ఎలాంటి రాతలు ఉండరాదన్నారు. కొందరు వాహనదారులు జరిమానా తప్పించుకునేందుకు నంబర్లు ప్లేట్‌లను వంకరటింకరగా లేదా ఒక నెంబర్‌ను తొలగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను గుర్తించి జరిమానా విధిస్తామన్నారు.

వేణుగోపాల్‌పూర్‌లో రెండిళ్లలో చోరీ

● లక్ష నగదు.. రెండు బంగారు ఉంగరాలు అపహరణ

తంగళ్లపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సింగిరెడ్డి కవిత, సామ అంజవ్వలు ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళ్లగా ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కవిత ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు రెండు బంగారు ఉంగరాలు, వెండి కాళ్ల పట్టీల ను ఎత్తుకెళ్లారు. కాగా అంజవ్వ ఇంటి తాళాలు పాగుల గొట్టి బీరువాలో బట్టలు చిందరవందరగా చేశారు. ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాలు చోరీ

ఇల్లందకుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడుసీసీ కెమెరాలు దొంగతనం జరిగినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. పాఠశాలలో ఏడు సీసీ కెమెరాలు ఉండగా, శని, ఆదివారాలు రెండ్రోజులు సెలవు రావడంతో అందులోని మూడు సీసీ కెమెరాలు, విద్యుత్‌ఫీజ్‌లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. వాటివిలువ సుమారు రూ.40వేల వరకు ఉంటుందని తెలిపారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జీ హెచ్ఎం వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.



యునాని వైద్యానికి సుస్తీ

● రెండేళ్లుగా లేని వైద్యుడు
● ఇబ్బందులు పడుతున్న రోగులు

మల్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మల్యాలలోని యునాని ఆసుపత్రిలో రెండే ళ్లుగా వైద్యుడు లేక రోగులకు వైద్య సేవలు అందక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు యునాని మందులు సమర్థవంతంగా పని చేస్తాయనే నమ్మకంతో రోగులు యునాని ఆసుపత్రికి వస్తుంటారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారులు పట్టింపులేని వైనంతో వాటి మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. మల్యాల యునాని ఆసుపత్రిలో 2023 మే నుంచి వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు స్తంభించిపోయాయి. అక్కడ వైద్యులు అందు బాటులో ఉన్నప్పుడు నిత్యం 50మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందగా ప్రస్తుతం ఐదులోపే రోగులు వస్తున్నారు. ఇక్కడ ఇక ఫార్మ సిస్ట్ మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యునాని వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని పలువురు రోగులు కోరుతున్నారు.

● వైద్యులు లేరని మందుల సరఫరా నిలిపివేత

యునాని ఆసుపత్రుల్లో డాక్టర్ల లేమితో మందుల సరఫరా నిలిపివేశారు. ఏళ్ల తరబడి మందులను వినియోగిస్తున్న రోగులు రెగ్యులర్ గా వాడే మందులు లేక పోవడంతో ఆందోళన చెందుతు న్నారు. వైద్యులు లేకుండా రోగికి ఎలా మందులు అందిస్తామని మల్యాల యునాని ఆసుపత్రికి మందులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. దీంతో వైద్యులు లేక మం దులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

● దీర్ఘకాలిక వ్యాధులకు మేలు

యునాని వైద్యం అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుం దని చాలా మ్మి ంది రోగులు నిత్యం ఈ మం దులను వినియోగిస్తుంటారు. చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, కిడ్నీలో రాళ్లు, లివర్ ఇన్‌ఫెక్షన్, మహిళలు ఎదుర్కొనే పలు రకాల సమస్యలకు ఈ యునాని వైద్యం ఎంతో మేలు చేస్తుంది. యునాని ఆసుపత్రికి వైద్యులను, సిబ్బందిని నియమించడంతో పాటు మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని రోగులు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

సహకార సంఘం

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

● 95 బస్తాలు పంపి 150 బస్తాలకు ట్రక్ షీట్ తెప్పించుకున్న ఉద్యోగి
● ఆ మొత్తం అమౌంట్ తన ఖాతాలోకి బదిలీ చేసుకున్న వైనం
● సొసైటీలలో పనిచేసే సిబ్బందిపై నిఘా కరువు

సైదాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి విశాల సహకార సంఘం ధాన్యం కొనుగోళ్లలో అస్టెంట్ సీఈవోగా పనిచేసే ఓ ఉద్యోగి గోల్‌మాల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెన్కేపల్లి సొసైటీలో పనిచేస్తున్న సదరు ఉద్యోగి గత యాసంగి సీజన్‌లో వెన్కేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 95బస్తాల ధాన్యం పంపి 150 బస్తాల ట్రక్ షీట్ తెప్పించుకొని ఆ పూర్తి అమౌంట్‌ను తన ఖాతాలోకి బదిలీ చేయించుకున్నాడు. ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ఉద్యోగి సొంతసోదరుడు సొసైటీలో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. ఆ ఉద్యోగి ఇంతకు ముందు అక్రమంగా ఓ లారీ ధాన్యం మిల్లుకు పంపి ఆ మొత్తం అమౌంట్ తనఖాతాలోకి బదిలీచేసుకొన్నాడు. ఇలాంటి సంఘటనలు గతంలో ఎన్నో జరిగినా లోలోపల సెటిల్‌మెంట్ చేసినట్లు ఆరోపనలు వినిపిస్తున్నాయి. సొసైటీలో పనిచేసే సిబ్బంది తమ ధాన్యం ఎంతమాయం చేస్తున్నారోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పైఅధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిని వెంటనే విధుల నుంచి తప్పించి సొసైటీని కాపాడాలని రైతులు కోరుతున్నారు. సొసైటీలో పనిచేసే సిబ్బందిపై నిఘా కరువైందని అందుకే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెన్కేపల్లి గ్రామస్థులు తెలుపుతున్నారు.

ఎరుకల హక్కుల పరిరక్షణ లక్ష్యం

సుభాష్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎరుకల హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి అన్నారు. ఈనెల 29న హైదరాబద్‌లో నిర్వహించనున్న సమితి 29వ ఆవిర్భావ వేడుకల పోస్టర్‌ను సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి బిజిలి శ్రీనివాస్, సహాయకార్యదర్శి బిజిలి శ్యామ్, ఉపాధ్యక్షుడు బిజిలి శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం జాతీయ కో కన్వీనర్ దాసరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పోచమ్మ విగ్రహం ధ్వంసం

ధర్మపురి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం కొసునూర్‌పల్లె గ్రామంలో పోచమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ఓ మహిళా భక్తురాలు అమ్మవారి దర్శనం కోసం వెళ్లగా పోచమ్మవిగ్రహం ధ్వసంచేసి ఉంది. దీంతో భక్తురాలు గ్రామస్థులకు సమాచారం అందించింది. విగ్రహం ధ్వంసం గురించి మాజీసర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాగ్ స్క్వాడ్ బృందంసభ్యులు పరిసరాలు పరిశీలించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ ధ్వంసమైన పోచమ్మ విగ్రహాన్ని పరిశీలించి గ్రామంలో విచారణ చేపట్టారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడులను ఖండించాలి

భగత్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడులను ఖండించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులపై బీజేవైఎం నాయకులు చేసిన దాడులపై బస్టాండ్ ముందు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నాగోల్, బండ్ల గూడలోని నవచేతన విజ్ఞానకేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న మారణ కాండను ఆపాలని నిరసన చేపడితే బీజేపీ అనుబంధ సంఘమైన బీజేవైఎం నాయకులు అడ్డుకోవడం అప్రజాస్వామిక మన్నారు.

అంతటా క్యూఆర్ కోడ్



రంగాపూర్ గ్రామంలో క్యూఆర్ కోడ్‌తో వస్తువులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- చిల్లర కష్టాలు తప్పాయి..
- డిజిటల్ పేమెంట్లు పెరిగాయి..

హుజూరాబాద్‌రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు చేసిన కేంద్రం ఆర్థిక సంస్కరణలో భాగంగా నగదు రహిత లావాదేవీల మీద దృష్టి సారించింది. దీంతో బ్యాంకర్లు గ్రామ స్థాయి నుంచి క్షేత్ర స్థాయిలో నగదు రహిత లావాదేవీల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రారంభ దశలో ప్రజలు లావాదేవీలు చేసేందుకు ఇబ్బందులు పడినప్పటికి ప్రస్తుతం పూర్తి స్థాయిలో నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడంతో వినియోగదారులు చేతిలో డబ్బులు లేకపోయినా తమ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌తో ఆర్థికలావాదేవిలు జరుపుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో నగదు లావాదేవీలు

ఒకప్పుడు అందరూ ఎక్కడికి వెళ్లిన సరిపడా డబ్బులు తీసుకెళ్లేవారు. ఇంకా అవసరమైతే బ్యాంకుల్లోనో, ఏటీఎం సెంటర్లలోనో నగదు విత్‌డ్రా చేసుకొని వినియోగించుకునేవారు. ప్రసుత్తం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్ ఫోన్లు, నగదు బదిలీల కోసం యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. నగదు రహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్‌లు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి తోపుడు బండ్ల వద్ద నుంచి పెద్దపెద్ద వ్యాపారస్తులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ క్యూఆర్‌కోడ్‌లు అందుబాటులో ఉండడంతో రోజుకు రూపాయి నుంచి లక్ష వరకు యాప్‌ల ద్వారా నగదు రహిత ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

వివిధ యాప్‌లు...

ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేసేందుకు స్మార్ట్‌ఫోన్లలో వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌లతో పాటు న్యావీ, సూపర్ డాట్ మనీ, బిల్ డెస్క్ వంటి యాప్‌ల్లోనూ డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. ఆయా యాప్‌ల కంపెనీ నిర్వాహకులు, వ్యాపారులు సౌకర్యార్థం దుకాణాదారులకు సౌండ్ బాక్సులు ఇస్తున్నారు. యాప్స్ నిర్వాహకులు రోజువారీ ట్రాన్స్‌సెక్షన్స్ బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తుండడంతో వ్యాపారాలు క్యూఆర్‌కోడ్‌ల వినియోగం మీద ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు చిల్లర గొడవ తప్పింది.

క్యూఆర్‌తోనే చెల్లిస్తున్నాం..



వంతడుపు సాత్విక, చెల్పూర్.

గతంలో కిరాణం దుకాణానికి పెద్దనోటు తీసుకొని వెళితే చిల్లర కోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. గత్యంతరం లేక అవసరం లేకపోయినా చిల్లరకు సరిపడా సరుకులను కొనుగోలు చేయాల్సి పరిస్థితి ఉండేది. స్మార్ట్ ఫోన్‌ల ద్వారా చెల్లింపులు మొదలవడంతో చిల్లర కష్టాలు తగ్గాయి.

అవగాహన కల్పిస్తున్నాం..



-చీకటి చంద్రశేఖర్, వ్యాపారస్తుడు, రంగాపూర్.

షాపుకు వచ్చేవారందరూ ఏ వస్తువు కొన్నా స్మార్ట్ ఫోన్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ పేమెంట్‌లు రోజురోజూకు పెరుగుతున్నాయి. మాకు కూడా చిల్లర కష్టాలు తగ్గాయి. క్యూఆర్‌కోడ్ గురించి తెలియని వారికి తెలియజేస్తున్నాం.

ముగిసిన ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు

- కన్నుల పండువగా పెద్దపట్నం, అగ్నిగుండం

ఓదెల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా ముగిశాయి. ఆదివారం పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు ప్రారంభమై సోమవారం తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు అగ్నిగుండం దాటి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులను సమర్పించారు. ప్రతి ఏడాది ఉగాది నుంచి ఆషాఢ మాసం పౌర్ణమి వరకు జాతర కొనసాగుతుంది. అగ్నిగుండం, పెద్ద పట్నాలతో జాతర ముగించడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవాలను పురస్కరించుకొని క్షేత్రంలో మహాగణపతి పూజ, గౌరీపూజ, మంటపస్థాపన నిర్వహించారు. అలాగే వీరభద్ర స్వామిపూజా కార్యక్రమం, అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్, జనగామ, వరంగల్, మంచిర్యాల, సిద్దిపేట, భూపాలపల్లి జిల్లాల నుంచి దాదాపు ఐదువేలమంది భక్తులు హాజరయ్యారు. ఒగ్గు పూజారుల డమరుక నాదాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, శివసత్తుల కేరింతల మధ్య ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. రెండురోజుల దాదాపు మూడు లక్షల రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో సదయ్య తెలిపారు.



అగ్నిగుండం నుంచి దాటుతున్న భక్తులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వేములవాడ కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని అనుబంధ ఆలయాల్లో పూజలు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

రాజన్నసేవలో చొప్పదండి ఎమ్మెల్యే

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దర్శించుకున్నారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయఅర్చకులు, అధికారులు స్వస్తి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేకపూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయఈవో రాధా బాయి స్వామివారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారివెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, శ్రీనివాస్ శర్మ, రాజేందర్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతపై కేంద్ర బృందం సర్వే



మాదాపూర్ జీపీ ఆవరణలోని ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గన్నేరువరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షణ్ 2025లో భాగంగా మండలంలోని యాస్వాడ, మాదాపూర్ గ్రామాల్లో సోమవారం కేంద్ర సర్వే బృందం ఆధ్వర్యంలో అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సంస్థ సర్వే నిర్వహించింది. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు చెత్త సేకరణ తీరు, తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు అంశాలపై నేరుగా ప్రజలతోమాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. వ్యర్థాలనిర్వహణ, సెగ్రిగేషన్‌షెడ్డులో వర్మీకంపోస్టు పద్ధతి, సేంద్రీయ ఎరువులతయారీ, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడుగుంతల నిర్మాణం, శుద్ధమైన తాగునీటిసరఫరా, పచ్చదనం, ప్రభుత్వసంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్యపరిస్థితి, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాల అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులు కేటాయిస్తూ సర్వే నిర్వహించారు. రెండుగ్రామాల్లోకలిసి 16ఇళ్లను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించారు. కార్యక్రమంలో అకాడమీఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సూపర్‌వైజర్‌లు రజిత,రాణి, ఎంపీడీవోశ్రీనివాస్, ఎస్‌బీఎం జిల్లాకోఆర్డినేటర్లు వేణు, ప్రసాద్, రమేష్, కార్యదర్శులు, జీపీసిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య రోడ్డు విస్తరణ పనులు

- వేములవాడలో భవనాల కూల్చివేత
- అడ్డుకునేందుకు యత్నించిన బాధితులు

వేములవాడ కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడపట్టణంలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణపనుల్లో భాగంగా భవనాల కూల్చివేతను సోమవారం తెల్లవారుజామున ప్రారంభించారు. కొద్దిరోజు లుగా బ్రిడ్జి సమీపం నుండి రాజన్న ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులావున్న భవనాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితేతిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ రెండవ బ్రిడ్జికి ఎదురగావున్న సుమారు 30ఇళ్లను ఖాళీచేయాల్సిందిగా అధికారులు 15రోజుల క్రితం బాధితులకు నోటీసులు ఇచ్చారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున ఎక్స్‌కావేటర్‌లతో భవనాల కూల్చివేతను చేపట్టారు.



తిప్పాపూర్‌లో భవనాలు కూల్చివేస్తున్న యంత్రాలు



కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

పరిహారం అందించలేదని ఆందోళన

తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న భవన యజమానులకు పరిహారం అందలేదని, పరిహారం అందించక ముందే ఇళ్లను కూల్చివేయడం సరికాదని పలువురు బాధితులు అడ్డుకునేందుకు యత్నించారు. భవనాలను కూల్చివేస్తున్న యంత్రాల ముందుకు వెళ్లి అడ్డుకునేం దుకు యత్నించారు. దీంతో అక్కడే వున్న పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్ రావాలని, తమకు తగిన న్యాయంచేయాలని బాధితులు నినాదాలు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇల్లు కోల్పుతున్న ఓమహిళ అడ్డుకునేందుకు యత్నించింది. దీంతో అక్కడే వున్న మహిళాపోలీసులు అడ్డుకున్నారు. దీంతో సదరు మహిళ పరిహారం చెల్లించుకుండానే తమ ఇల్లు కూల్చివేస్తున్నారని, ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమ ఇంటిని కూల్చవద్దని మరో యువకుడు తన ఇంటిపైన వున్న హోర్డింగ్‌పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు.

పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భవనాల కూల్చివేతను జిల్లాకలెక్టర్ సందీప్‌కుమార్ఝా పరిశీలించారు. ఈసందర్భంగా భవనాలు కోల్పోతున్న బాధితులు కలెక్టర్‌నుకలిసి పరిహారం అందలేదని వారి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పరిహారం కోర్టులో జమచేయడం జరిగిందని, తీసకోవాల్సిన వారు తమ పరిహారం తీసుకోవచ్చని కలెక్టర్ సూచించినట్లు బాధితులు తెలిపారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న తరుణంలో రోడ్డువెడల్పు చేయాలని, వేములవాడకు వచ్చేభక్తులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యంగా ఉంటుందని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా తెలిపారు. అనంతరం తిప్పాపూర్‌లోని గోశాలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

మెడికల్ ఏజెన్సీలపై విచారణ చేపట్టాలి

సుభాష్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మెడికల్ ఏజెన్సీలపై సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బావండ్ల యుగేందర్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకేంద్రంగా నకిలీమందుల దందా నడుస్తోందన్నారు. డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ కను సన్నల్లోనే దందాకొనసాగుతోందని ఆరోపించారు.

వర్షాల కోసం కప్పతల్లి ఆట

వీణవంక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఎస్సీ కాలనీ వాసులు వర్షాలు పడాలని సోమవారం కప్పతల్లి ఆట ఆడారు. ప్రజలు కప్పలపై నీరు పోస్తూ వర్షాలు పడాలని కోరుకున్నారు.



కప్పతల్లి ఆట ఆడుతున్న గ్రామస్థులు

ఉత్తమ సహకార సంఘంగా చొప్పదండి పాక్స్

- అవార్డును ప్రకటించిన నాబార్డు

చొప్పదండి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక సహకార సంఘానికి ఉత్తమ సహకారసంఘం అవార్డును నాబార్డు సంస్థ ప్రకటించింది. ఈమేరకు నాబార్డు 44వవార్షికోత్సవం సందర్భంగా చొప్పదండి పీఏసీఎస్‌కు బెస్ట్‌పెర్ఫార్మింగ్ పాక్స్ అవార్డును ప్రకటించింది. ఈఅవార్డును హైదరాబాద్‌లో మంగళ వారం జరిగే నాబార్డు 44వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సొసైటీ అధ్యక్షులు వెల్మ మల్లారెడ్డి, సీఈవో క్ళాం తిరుపతిరెడ్డికి అందజేయనున్నారు. కాగా చొప్పదండి పాక్స్‌కు అవార్డుపట్ల కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు, డీసీవో రామానుజాచార్యులు హర్షం వ్యక్తం చేశారు.



చొప్పదండి సహకార సంఘం

పంట పొలాల్లో చిరుత సంచారం

- భయంతో పరుగులు తీసిన రైతు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్వో

ఎల్లారెడ్డిపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ సెక్షన్ పరిధిలోని రాగట్లపల్లి గ్రామశివారు వ్యవసాయ పొలాల్లో రైతు రాయం సురేశ్‌కు సోమవారం చిరుతపులి కనిపించింది. దీంతో అతడు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశాడు. అది విన్న చుట్టు పక్కల రైతులు అక్కడకు చేరుకున్నారు. చేతుల్లో కర్రలు పట్టుకుని భయం భయంగా గడిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సిరిసిల్ల ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్ ఆధ్వర్యంలోని అధికారులు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. చిరుతపులి ఎక్కడ కనిపించిందని రైతు సురేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. చిరుత పాదముద్రలను పరిశీలించారు. ముద్రలను గమనించిన అధికారులు అవి చిరుతపులివేనని నిర్ధారించారు. చిరుతపులి సంచారంతో చుట్టు పక్కల గ్రామాలైన రాగట్లపల్లి, పదిర, నారాయణపూర్, దుమాల తదితర గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు రైతులకు చిరుతపులి సంచారం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వెంకటాపూర్ డీఆర్వో మోహన్‌లాల్, ఎఫ్ఎస్‌వోలు సాకారం, రంజిత్ కుమార్, ఎఫ్‌బీవో అనూష, రైతులు ఉన్నారు.



పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్

● రైతులు అప్రమత్తంగా ఉండాలి..
- ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్

చిరుత పులి సంచరిస్తుండడంతో ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లోని గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్ హెచ్చరించారు. వ్యవసాయ పొలాలు, పశువుల మేత, అటవీ ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. రాగట్లపల్లి శివారులో చిరుత సంచారం ఆనవాళ్లను గుర్తించామని పేర్కొన్నారు. చిరుత కోసం పరిసరాల్లో గాలించామని అన్నారు. రైతులు, పశువులకాపరులు చీకటి పడక ముందే ఇళ్లకు చేరుకోవాలని అన్నారు. ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఎఫ్ఆర్వో శ్రీహరిప్రసాద్ పేర్కొన్నారు.

పెళ్లిలో తీసుకున్న కట్నం చెల్లించాలి

- అత్తాగారి ఇంటి ఎదుట బైఠాయించిన కోడలు
- సంఘీభావం ప్రకటించిన ఐద్వా నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): పెళ్లి సమయంలో మా తల్లిగారు ఇచ్చిన వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు తిరిగి చెల్లించాలంటూ సోమవారం అత్తగారింటి ఎదుట కోడలు బైఠాయించింది. రాజన్నసిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల చిన్నబోనాల గ్రామానికి చెందిన గోస్కుల పర్శరాములకు నాలుగు సంవత్సరాల క్రితం కోనరావుపేట మండల మల్కాపేట గ్రామానికి చెందిన కీర్తనతో వివాహం జరిగింది. అయితే పెళ్లి జరిగిన వారం తర్వాత నాకు భార్య వద్దని పర్శరాములు కీర్తనను పుట్టింటికి పంపించాడు. అప్పటి నుంచి కీర్తన తల్లిగారి ఇంటివద్దనే ఉంటోంది. పెళ్లిసమయంలో ఇచ్చిన వరకట్నంతోపాటు ఇతర లాంఛనాలను తిరిగి అత్తాగారి ఇంటినుంచి ఇప్పించాలని పోలీస్ స్టేషన్ కువెళ్లి కీర్తన పలుమార్లు ఫిర్యాదు చేసింది. ఎవరూ పట్టించుకోపోవడంతో సోమవారం ఐద్వా జిల్లాకార్యదర్శి విమలతో పాటు నాయకురాళ్లతోకలిసి కీర్తన చిన్నబోనాల గ్రామానికి చేరుకుని న్యాయం చేయాలంటూ అత్తాగారింటి ఎదుట బైఠాయించింది. బాధితురాలు కీర్తన మాట్లాడుతూ గ్రామంలో పెద్దమనుషులు మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాలని లేకపోతే పోరాటం చేస్తామన్నారు. కీర్తనకు న్యాయం జరిగేంత వరకు ఐద్వా అండగా ఉంటుందని జిల్లా కార్యదర్శి విమల ప్రకటించారు.



నిరసన తెలుపుతున్న కీర్తన, ఐద్వా నాయకులు

తెలంగాణ రైతాంగంపై బీజేపీ వివక్ష

- యూరియా కోటా తగ్గించి కక్ష సాధింపు
- బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక కేటాయింపులు
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

గోదావరిఖని, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కోటా తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. సోమవారం రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని, రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంటాయని ప్రజలు భావించారన్నారు. మన్మోహన్ సింగ్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు అన్నీ చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డా ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణాన్ని స్వాగతించారన్నారు. కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక యూరియా కేటాయించి తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్న బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సంవత్సరం కంటే ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1.14లక్షల టన్నులు తక్కువ కేటాయించారని, జూలై కోటా లోనే 30వేల టన్నులు తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి విజ్ఞప్తి చేసినా సరఫరా పెరగలేదన్నారు. వరినాట్ల సీజన్ మొదలైందని, పదిరోజుల్లో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈలోపే కేంద్రం యూరియాను సరఫరా చేయాలని కోరారు. తాను కూడా కేంద్ర మంత్రిని కలిసి రైతాంగం ఇబ్బందుల గురించి వివరిస్తానన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా కేటాయించకపోవడాన్ని లేవనెత్తుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, మల్లికార్జున్, తొగరి తిరుపతి, కామ విజయ్, జీన్స్ నర్సింగ్‌దొర తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ

ఆర్ఎఫ్‌సీఎల్‌ను సందర్శించిన ఎంపీ..

కోల్‌సిటీ: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం ఆర్ఎఫ్‌సీఎల్‌ను సందర్శించారు. ఆర్ఎఫ్‌సీఎల్ యూనిట్ హెడ్ రాజీవ్ కుల్బే, హెచ్ఆర్ డీజీఎం సోమనాథ్, అడిషనల్ మేనేజర్ అజయ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. యూనిట్‌హెడ్ రాజీవ్ కుల్బే ప్రాజెక్టులో ఉత్పత్తి, ఏయే రాష్ట్రాలకు యూరియా సరఫరా జరుగుతుందనే వివరా లను ఎంపీకి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం ఎరువులు సరఫరా చేస్తున్నామని, ముఖ్యంగా తెలంగాణకు నిర్దేశించిన కోటాలో ఎక్కడా తగ్గకుండా యుద్ధ ప్రాతిపదిన సరఫరా చేస్తున్నామన్నారు. కంట్రోల్‌రూమ్‌లో ప్లాంట్ పనితీరును అధికారులు వివరించారు. రోజువారి రవాణా వివరాలను వెల్లడించారు.

కాళేశ్వరం కూలిపోయే ప్రాజెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కూలే ప్రాజెక్టు అని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కాళేశ్వరంలో నీళ్లు నింపితే కూలిపోతుందని చెప్పారని కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కాల్వ లింగస్వామి అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టును అప్పజెబితే మూడు రోజుల్లో నీటిని నింపి ఎలా వినియోగించాలో చేసి చూపెడుతామని జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఓ దొంగ అని, ఆయన చరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఆయనను సూర్యాపేటలోని ఓ రైస్‌మిల్లులో కొట్టిన చరిత్ర అందరికీ తెలుసున్నారు. కేసీఆర్ సొంత నిర్ణయాలతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, అది ఇప్పుడు కూలి పోయే దశకు చేరుకుందని అన్నారు. 20 ఏళ్ల క్రితం కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు చెక్కు చెదరలేదని, జగదీశ్వర్‌రెడ్డి ఆ ప్రాజెక్టును చూడాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చందర్ ఇంట్లో సమావేశం పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు మంచిగా ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, బొమ్మక రాజేష్, గడ్డం శ్రీనివాస్, తాళ్లపల్లి యుగంధర్, శివ, మిడిదొడ్డి ప్రవీణ్, నజీమోద్దీన్, పాల్గొన్నారు.

17న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని సుశ్రీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులో మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న కలెక్టరేట్‌లో రూం నంబరు 225లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ ఆపై ఉత్తీర్ణులైన 18-35 ఏళ్ల లోపు యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 8121262441, 9866019365, 8985336947 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు గడువు ఈ నెల 17 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి అందించనున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవకాశం ఉందని తెలిపారు. nationalawardstoteacher.education.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని, మూడు ప్రతిపాదనలను ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

నిజాయితీ చాటుకున్న రైతు



పట్టా అందజేస్తున్న తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఒజ్జె శ్రీనివాస్‌కు చెందిన 11 గుంటల వ్యవసాయ భూమి, అదే గ్రామానికి చెందిన కోరే మల్లయ్యకు రెవెన్యూ రికార్డులో తప్పుగా నమోదైంది. దీంతో మల్లయ్యకు పట్టాదారు పాసు బుక్కు రావడంతో ఈ విషయంపై రైతు ఒజ్జె శ్రీనివాస్ ఇటీవల భూభారతిలో దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి కోరే మల్లయ్య సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి వచ్చి విక్రయ దస్తావేజు ద్వారా శ్రీనివాస్‌కు పట్టా చేశాడు. ఈ మేరకు తహసీల్దార్ జగదీశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్ కోరే మల్లయ్యను అభినందించి, శ్రీనివాస్‌కు పట్టా అందజేశారు.

పాఠశాలలో గ్రీన్ డే వేడుకలు



ఆకుపచ్చ దుస్తుల్లో చిన్నారులు

పెద్దపల్లి కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో సోమవారం గ్రీన్ డే నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చ దుస్తులు ధరించి పచ్చదనం ఆవశ్యకతను చాటారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని, ఇందులో భాగంగా పచ్చదనంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులకు పూలు, పండ్ల మొక్కలను అందించారు. కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక పాల్గొన్నారు.

నేటి నుంచి మండల పరిషత్‌లో బయోమెట్రిక్ హాజరు

ఓదెల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు ప్రారంభం కానుంది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశంతో కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు మిషన్‌ను అమర్చారు. రోజు 10.30 గంటలలోగా కార్యాలయానికి వచ్చి ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉంటుంది. దీంతో సమయపాలన అమలయ్యే అవకాశాలు ఉన్నాయి. సోమవారం బయోమెట్రిక్ మిషన్‌లో మండల పరిషత్ కార్యాలయం, ఈజీఎస్ కార్యాలయ ఉద్యోగుల వేలిముద్రలను నమోదు చేశారు.

సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలన

ముత్తారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పారుపల్లి గ్రామపంచాయతీని మంథని డీఎల్పీవో కొమ్మెర సతీష్‌కుమార్, ఎంపీడీవో సురేష్, ఎంపీవో భాస్కర్‌రావు సోమవారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్మశానవాటిక వినియోగం, సెగ్రిగేషన్ షెడ్డు నిర్వహణ వంటివాటిపై కార్యదర్శి రవీందర్‌కు సూచనలు జారీ చేశారు.

నేడు స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాక

పెద్దపల్లి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందం రానున్నట్లు ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవపూర్‌కు ఉదయం 8.30 గంటలకు, బ్రాహ్మణపల్లికి మధ్యాహ్నం 2 గంటలకు రానున్నట్లు పేర్కొన్నారు. సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, మురికి కాలువల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలలో వసతులను పరిశీలించనున్నట్లు తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలకసంస్థ పరిధిలో అంటు వ్యాధులు ప్రబలకుండా నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష జరిపారు. ఇంటింటా సందర్శించి జ్వర సర్వే చేయాలన్నారు. సర్వే సందర్భంగా పారిశుధ్య సమస్యలు గుర్తిస్తే కార్పొరేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రభుత్వాసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డెంగ్యూ అనుమానిత కేసులు వచ్చినప్పుడు మున్సిపల్ సిబ్బందికి వారి నివాసాల వివరాలు తెలుపాలన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించి తాగునీటి క్లోరినేషన్, నిల్వ ఉన్న నీరు తొలగించడం, బ్లీచింగ్, స్ప్రేయింగ్, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని అన్నప్రసన్న కుమారి మాట్లాడుతూ నివాసాల మధ్యలో అపరిశుభ్రత నెలకొన్న పరిస్థితులను మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంటకస్వామి, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు మాణికేశ్వర్‌రెడ్డి, సాదిక్‌పాషా, అహల్య, పద్మ, రమణి, దేవెన, స్నేహలత, కార్పొరేషన్ ఎస్‌ఐలు నాగభూషణం, కుమారస్వామి, కిరణ్, జూనియర్ అసిస్టెంట్ శంకర్‌స్వామి, మెప్మా టీఎంసీ మౌనిక, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

అరుణోదయ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

గోదావరిఖని, జూలై 14(ఆంధ్రజ్యోతి): అరుణోదయ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఇల్లందులో జరిగే రాష్ట్ర సదస్సులో కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు బతుకుల రాజన్న పిలుపునిచ్చారు. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బతుకుల రాజన్న, సీహెచ్ అబెద్నెగో మాట్లాడుతూ నరేంద్ర మోదీ, అమిత్ షాలు ప్రజా సంపద కొల్లగొట్టడానికి చట్టాలను విస్మరించి ఆదివాసులపై, మావోయిస్టులపై దాడి చేసి హత్య చేయడం విచారకరమన్నారు. ప్రకృతి సంపదతో పాటు, విలువైన ఖనిజ సంపదను అంబానీ, ఆదానిలకు అప్పగించాలని చూస్తోందన్నారు. అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు దోనూరి రాజమౌళి, సభ్యులు బానేష్, మల్లేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ స్థలాన్ని కబ్జా చేసిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

మంథని, జూలై 14(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ బలంతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య డ్రైనేజీని మూసేసి స్థలాన్ని కబ్జా చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని 2వ వార్డుకు చెందిన గంగాధర సమ్మయ్య ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎరుకల గూడెంలో ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారన్నారు. డ్రైనేజీ స్థలాన్ని కబ్జా చేసి కాంపౌండ్ వాల్‌ను నిర్మించుకున్నారన్నారు. డ్రైనేజీ స్థలం కబ్జా చేయడం వల్ల భవిష్యత్తులో వరద నీరు రోడ్ల మీద నుంచే వెళ్లే అవకాశమున్నదన్నారు. ఈ విషయంలో కలెక్టర్‌కు నాలుగు సార్లు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కబ్జాపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దండె మధుకర్, శంకర్‌లు పాల్గొన్నారు.

బోనస్ ఎప్పుడు...?

(5వ పేజీ తరువాయి)

ద్వారా పంపిణీ చేస్తున్నది. ఏప్రిల్, మే నెలనెలా ఇవ్వగా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు గాను ఒక్కసారే సన్న బియ్యం పంపిణీ చేశారు. ప్రతీ సీజన్‌లోనూ సన్న ధాన్యం పండించే రైతులకు బోనస్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గడిచిన యాసంగి సీజన్‌లోనూ రైతులు సన్న రకం వరి పంటను సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 7,93,400 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించగా, వారికి క్వింటాల్‌కు 500 రూపాయల చొప్పున 39 క్వింటాళ్ల 67 లక్షల రూపాయలు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. సీజన్ ముగిసి నెల 15 రోజులు గడుస్తున్నా కూడా ప్రభుత్వం బోనస్ ఊసెత్తడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌కు గాను ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున రైతు భరోసా నిధులను తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం త్వరగానే బోనస్ డబ్బులను కూడా విడుదల చేస్తుందని ఆశించారు. ఈ విషయమై తక్షణమే ప్రభుత్వం స్పందించిన బోనస్ డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సంబంధిత రైతులు కోరుతున్నారు.

ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు సన్మానం

కళ్యాణ్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపో డ్రైవర్లు ఎంఎల్ నారాయణ, శ్రీనివాస్ జూన్ మాసంలో ఇంధనాన్ని ఆదా చేసినందుకు సోమవారం వారిని సన్మానించారు. డీఎం మాట్లాడుతూ నారాయణ 7,852కిలో మీటర్లు నడిపి 1200లీటర్ల డీజిల్ వినియోగించి 5.69 కేఎంపీఎల్‌కుగాను 6.54 కేఎంపీఎల్ సాధించి 108లీటర్ల డీజిల్‌ను ఆదా చేశాడన్నారు. అలాగే శ్రీనివాస్ 7973 కిలోమీటర్లు 1598లీటర్ల డీజిల్ వినియోగించి 4.70 కేఎంపీఎల్‌కు గాను 4.99కేఎంపీఎల్ సాధించి 99లీటర్ల డీజిల్ ఆదా చేసినట్టు చెప్పారు. ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డ్రైవర్లకు నగదు బహు మతులను అందజేశారు. అసిస్టెంట్ మేనే జర్ గీత కృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

ఓదెల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేదని వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. రైతువేదికలో సోమవారం ఎరువుల డీలర్లతో అధికారులు సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, ఎరువుల సరఫరాపై సమీక్షించారు. మండలంలోని రైతులకు ఎలాంటి కొరత లేదని, సరిపడా ఎరువుల నిలువలు ఉన్నాయని అన్నారు. ఏఈఓలు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నానో యూరియాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎరువుల లభ్యత, ఈపాస్ మిషన్ ద్వారా క్రయవిక్రయాల విధివిధానాలను తెలిపారు. ఎరువుల విక్రయాలు ఈపాస్ మిషన్ ద్వారానే చేయాలని తెలిపారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని మండల వ్యవసాయాధికారి అలివేణి అన్నారు. రాఘవపూర్ రైతువేదికలో ఫెస్టిసైడ్స్, ఎరువుల దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ డీలర్లు, రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రశీదులు ఇవ్వాలన్నారు.

కోట శ్రీనివాసరావుకు నివాళి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన సినీ నటుడు కోట శ్రీనివాస రావుకు బీజేపీ పట్టణ నాయకులు నివాళులర్పించారు. బీఎంఎస్ ఆఫీస్‌లో కోట చిత్రపటానికి పూలమాల వేసి, మౌనం పాటించారు. బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మన్ననలు పొందినట్టు ఆకుల శశికుమార్ తెలిపారు. మూకిరి రాజు, పాష, పొట్ల వెంకటి, దాసరి శ్రీనివాస్, ఆకుల కుమార్, కుమార్, నాగేందర్ పాల్గొన్నారు.

బీసీలను చైతన్యపరిచే బహుజనగణమన పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్టమధు

మంథని, జూలై 14(ఆంధ్రజ్యోతి): జూలూరు గౌరిశంకర్ రచించిన బహుజన గణమన పుస్తకం బీసీలను చైతన్య పరిచే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు అన్నారు. జ్యోతిబాపూలే విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువకులు కంప్యూటర్ యుగంలో జీవిస్తున్నారని, దేశం మౌలిక సిద్ధాంతాలు తెలియకుండా చదువు, ఉద్యోగం కోసం మాత్రమే తాపత్రయ పడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హైకోర్టు చివాట్లు పెట్టడం వల్లనే హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధమవుతుందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం జీవోలు, ఆర్డినేన్స్‌ల పేరుతో మోసం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

బహుజన గణమన పుస్తకం బీసీలకు రాజ్యాధికార అవశ్యకతను వివరించే గొప్ప పుస్తకమని మాజీ మార్కెట్ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్ అన్నారు.

సెంటినరీకాలనీలోని టిటూ సెంటర్‌లోని జ్యోతి రావుపూలే, అంబేద్కర్ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కుమార్‌యాదవ్, కాపురబోయిన భాస్కర్, ఆసంతిరుపతి, బుర్రశంకర్, పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మచ్చుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద రచయిత గౌరిశంకర్ రచించిన బహుజనగణమన పుస్తకాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జూలూరి గౌరీ శంకర్ రాసిన బహుజనగణమన పుస్తకాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తాటికొండ శంకర్, అనిల్ గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, పోలుదాసరి సాయికుమార్, పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): కన్నాల అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు జూలూరి గౌరి శంకర్ రచించిన బహుజనగణమన పుస్తకాలను ఆవిష్కరించారు. నాయకులు ఎంఎ అతిక్,బండారి కిరణ్, సదానందం గౌడ్, ఖాదర్ పాషా బూర్ల శ్రీహరి,ముత్యాల కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఆర్ఈడీ మనోహర్ పర్యటన



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్ఈడీ మనోహర్

జ్యోతినగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఈడీ(ఓఎస్), రీజినల్ ఈడీ(దక్షిణ) ఎ.కె.మనోహర్ సోమవారం రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులలో పర్యటించారు. హైదరాబాద్ నుంచి ఎన్టీపీసీకి వచ్చిన ఆర్ఈడీ మనోహర్‌కు జ్యోతిభవన్‌లో ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టును సందర్శించారు. ప్లాంటులో 5, 2వ యూనిట్‌లో జరుగతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ఎడిఎం భవనంలో గుర్తింపు, అధికారుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు అధికారులతో విద్యుత్ ఉత్పత్తిపై సమీక్ష నిర్వహిం చారు. జీఎం, ప్రాజెక్టు ఇన్‌చార్జి హెడ్ ఎ.కె.త్రిపాఠి పాల్గొన్నారు.

రామగుండంలో వేస్ట్ ఆడిట్

కోల్‌సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): వంద రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం గౌతమినగర్‌లోని డీఆర్‌సీ కేంద్రంలో వేస్ట్ ఆడిట్ నిర్వహించారు. పొడి చెత్తను వర్గీకరించడం, రీసైక్లింగ్, విక్రయించడంపై చర్చించారు. అక్బర్‌నగర్‌లో పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, దోమల నివారణ కార్యక్రమాలపై అవగాహన నిర్వహించారు. యైటింక్లయిన్‌కాలనీలోని వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకాల ప్రయోజనాలను వివరించారు. గంగానగర్‌లో ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఆర్ఐ శంకర్‌రావు, పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

కమాన్ పూర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మహిళలకు విద్య గొప్పతనం తెలిసేలా అమ్మకు అక్షర వందనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సల్మా, ల్యాబ్ టెక్నీషియన్ శారదా, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో ఆధార్ సెంటర్

రామగిరి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ ఎస్సీకాలనీ స్కూల్‌లో ఆధార్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. ఆధార్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్‌ను సద్వినియోగం చేసుకొవాలని కాంగ్రెస్ నాయకులు తొటచంద్రయ్య, మట్టరాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాలకుర్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి అన్నారు. సోమవారం ఆలివర్ పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

పాలకుర్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని మక్కాన్ సింగ్ సేవ సమితి చైర్మెన్ మనాలి ఠాకూర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కలికోట రామ్‌మోహన చారి. ఎంపీవో ఉప్పు సుధర్శన్, డిఈ అప్పలనాయుడును కలిసి గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

కుంట ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండల కేంద్రం సర్వే నెంబరు 247 లో గల ఇబ్రహీం కుంట అలియాస్ పోచమ్మ చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారుల నుంచి కాపాడాలని వివిధ సంఘాల నాయకులతో కలిసి దళితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇనగంటి భాస్కర్ రావు కుంట భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. మంథని రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆక్రమణలపై విచారణ జరిపి కుంట భూమిని కాపాడాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు కొమురయ్య, కనకయ్య, సంపత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కుక్క రవి, జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్, నాయకులు సీపెల్లి రవీందర్, చిప్పకుర్తి చంద్రయ్య, పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మనాలీ ఠాకూర్

కళ్యాణ్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. సోమవారం రాంనగర్‌లో గోరింటాకు సంబరాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. మహిళలు నృత్యాలు చేస్తూ గోరింటాకు సంబరాలను నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): కాలనీ ఎన్‌సీఏ క్లబ్‌లో సింగరేణి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు జరిగాయి. మహిళా సభ్యులు, మక్కాన్‌సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్‌తో కలిసి సాంప్రదాయం ఉట్టిపడేలా గోరింటాకు అలంకరించుకున్నారు. ప్రకృతితో మానవ జీవనం ముడి పడిఉన్నదని, ప్రకృతిలో వచ్చే మార్పులు మనపై ప్రభావం చూపుతాయని మనాలిఠాకూర్ అన్నారు. గోరింటాకు పెట్టుకోవడంలో సాంప్రదాయమే కాకుండా సైన్స్ ముడిపడిఉన్నదని అన్నారు.

రేపు గంగమ్మ తల్లి బోనాల జాతర

మంథని, జూలై 14(ఆంధ్రజ్యోతి): గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి బోనాల జాతరను విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ చైర్మన్ గంధం వెంకటస్వామి కోరారు. సోమవారం బోయినిపేటలో జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం ఉదయం మంథని పురవీధుల గుండా గోదావరినది తీరం వరకు బోనాల జాతర నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గంగపుత్రులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. అంబటి సతీష్, అంకరిప్రకాశ్, అటికేటి సురేష్, అంకరి శివ, అంబటి సురేష్, మర్రి రఘు, జిదుల రాజేందర్, అంబటి గట్టయ్య, మోసం శంకర్, అంకరిలింగయ్య, మోసం నరసయ్యలు పాల్గొన్నారు.



మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి



సీఎంఓతో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, జూలై 14(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని కొత్తగూడెంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌తో మాట్లాడడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సింగరేణిలో వివిధ రకాల వ్యాధులతో చాలా మంది కార్మికులు అవస్థలు పడుతున్నారని, తీవ్ర అనారోగ్యంతో వారు విధులు నిర్వహించడం లేదన్నారు. నాలుగు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, హయ్యర్ రెఫరల్ మెడికల్‌కు పంపిన కార్మికులకు కూడా మెడికల్ బోర్డుకు పిలవాలన్నారు. వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని కోరినట్టు తెలిపారు. మడ్డి ఎల్లాగౌడ్, సలేంద్ర సత్యనారాయణ, పాల్గొన్నారు.

మహిళా రెస్క్యూ సభ్యులకు శిక్షణ ప్రారంభం



శిక్షణ తరగతుల ప్రారంభంలో మాట్లాడుతున్న రెస్క్యూ జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళా అండర్ మేనేజర్ ఉద్యోగులకు రెండవ బ్యాచ్ రెస్క్యూ శిక్షణా తరగతులు సోమవారం ఆర్జీ-2లోని సింగరేణి రెస్క్యూ ప్రధాన స్టేషన్‌లో ప్రారంభమయ్యాయి. జీఎం రెస్క్యూ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణా తరగతులను ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా రెస్క్యూలో వారికి భాగస్వామ్యం కల్పించేలా అవసరమైన శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అత్యవసర ప్రమాదాలు జరిగినపుడు ఎదుర్కొనే పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే నైపుణ్యం పెంపొందుతుందన్నారు. 17 రోజుల పాటు ఇనీషియల్ శిక్షణ ఉంటుందని, మైనింగ్ థియరీ, గ్యాసెస్, గ్యాస్ డిక్టెటర్స్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, అంశాల్లో శిక్షణ ఉంటుందని రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మొదటి బ్యాచ్ మహి ళా ఉద్యోగులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు సీహెచ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ట్రైనర్స్ కిషన్‌రావు, సాజిద్‌అలీ, మురళీ, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి

కళ్యాణ్‌నగర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల పర్యటనలకు కార్మికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని డిపో మేనేజర్ నాగభూషణం పిలుపునిచ్చారు. సోమవారం ఆర్జీ-1 ఏరియా జీడీకే1ఇంక్లైన్‌పై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ బస్సులు కండీషన్‌తో పాటు నైపుణ్యం గల డ్రైవర్లతో ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవేస్తుందని చెప్పారు. ఆర్టీసీ కొత్తగా పుణ్యక్షేత్రాల ప్యాకేజీని తీసుకువచ్చిందని, అరుణాచలం, షిరిడి, శ్రీశైలం, యాదగిరిగుట్ట, స్వర్ణదేవాలయాలకు ప్రత్యేక బస్సులను నడుపుతుందని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. గని మేనేజర్ సుధీర్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయి నిఖిల్, పాల్గొన్నారు.

కాంట్రాక్టు టెక్నీషియన్ల నియామకాన్ని రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కాంట్రాక్టు పద్ధతిన టెక్నీషియన్లను తీసుకోవడాన్ని విరమించుకోవాలని హెచ్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ-2 యూనియన్ ఆఫీస్‌లో జరిగిన టెక్నీషియన్ల సమావేశంలో కొమ్ము మదునయ్య, మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడారు. సంస్థలో టెక్నీషియన్ల కొరత ఉన్నదని, ప్రైవేట్ టెక్నీషియన్లతో పనులు చేయించడం ప్రైవేటీకరణకు ప్రోత్సహించడమేనని వారు పేర్కొన్నారు. పర్మినెంట్ టెక్నీషియన్లను భర్తీ చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెక్నీషియన్లు శాంతి స్వరూప్, గోషిక అశోక్, రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.